
# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :12 సంచిక :245 శుక్రవారం 10-4-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


# రేవంత్ కన్నా... కేసీఆర్ పాలనే బెటర్



## తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది

- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్
- జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్
- కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

జగిత్యాల

రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు -మిగతా 2 లో



## కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

- మూడు బ్యారేజీలను వినియోగంలోకి తేవాలి
- పనుల పర్యవేక్షణకు మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు :
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించారు.

-మిగతా 2 లో




## రిలయన్స్ రిటైల్ వాల్యుయేషన్ భళా

- జనవరి నాటికి రూ.9.26 లక్షల కోట్లు
- హెక్టాకార్న్ జాబితాలో ఏడో స్థానం
- స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేషన్ స్కూల్ ఆఫ్ బిజినెస్

న్యూఢిల్లీ

ముకేశ్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ నాయకత్వంలోని 'రిలయన్స్ రిటైల్' మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జనవరి నాటికి అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం కంపెనీ విలువ (వాల్యుయేషన్) 10,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.9.26 లక్షల కోట్లు) దాటింది. దీంతో స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఈ కంపెనీని విలువపరంగా ప్రపంచంలోని ఏడో అతి పెద్ద ప్రైవేటు స్టార్టప్ కంపెనీగా ప్రకటించింది. ఏదైనా ప్రైవేటు స్టార్టప్ కంపెనీ మార్కెట్ విలువ 10,000 కోట్ల డాలర్లు దాటితే దాన్ని హెక్టాకార్న్ లేదా సూపర్ స్టార్టప్ అంటారు. మన దేశం నుంచి రిలయన్స్ రిటైల్ ఒక్కటే ఈ జాబితాలో చోటు సంపాదించింది. ప్రపంచంలో మరే ప్రైవేటు రిటైల్ స్టార్టప్ కూడా ఈ స్థాయిలో లేదని ఎస్‌జీసీబీ తెలిపింది. అగ్రస్థానంలో 'ఓపెన్ ఏఐ': ఈ తాజా జాబితాలో ఓపెన్ ఏఐ, ఆంథ్రోపిక్, ఇలాన్ మస్క్ నిర్వహణలోని స్పేస్ ఎక్స్ కంపెనీలు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 100 ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలతో

-మిగతా 2 లో

## భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

- ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్




2



## తుది ఒప్పందం వరకు ఇరాన్‌లోనే బలగాలు

- ఉల్లంఘనలు జరిగితే భారీ దాడులు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

న్యూఢిల్లీ,

కాల్పుల విరమణపై తుది ఒప్పందం కుదిరి అది పూర్తిగా అమలు జరిగే వరకు ఇరాన్ లోపల, చుట్టూ అమెరికా సైనిక బలగాల మోహరింపు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. పశ్చిమాసియాలో కాల్పుల విరమణ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్న నేపథ్యంలో ఇరాన్‌పై ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇప్పటికే గణనీయంగా బలహీనపడిన శత్రువును ఎదుర్కొనడానికి, నాశనం చేయడానికి అవసరమైన అదనపు మందుగుండు సామగ్రి, ఆయుధాలు, అన్ని అమెరికా నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది ఒప్పందం కుదిరి, పూర్తిగా అమలయ్యే వరకు ఇరాన్‌లోపల, దాని పరిసర ప్రాంతాలలోనే ఉంటాయి అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ తెలిపారు.అవగాహన ఉల్లంఘన తీవ్ర సైనిక ప్రతిస్పందనకు దారితీయగలదని ఆయన హెచ్చరించారు. ఏ కారణం చేతనైనా దీన్ని పాటించకపోతే అప్పుడు కాల్పులు మొదలవుతాయని, మునుపెన్నడూ ఎవరూ చూడనంత శక్తివంతమైనవిగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా కీలక లక్ష్యాలను పునరుద్ఘాటిస్తూ ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదని, హెర్ముజ్ జలసంధి తెరిచి, సురక్షితంగా ఉండాలని ఆయన తెలిపారు.


# పోలింగ్ ప్రశాంతం

## వేరువేరు చోట్ల ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

- పుదుచ్చేరిలో 86శాతం..
- అసోంలో 84.42శాతం..
- కేరళలో 77.45శాతం
- అసోంలో ఘర్షణలు : 30మందికి గాయాలు, ఏడుగురు అరెస్టు
- అసోంలో పోలింగ్ బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

న్యూఢిల్లీ

కేరళం, అసోం రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో చెదురుమదురు ఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు చోట్లా భారీ సంఖ్యలోనే పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో 86శాతం, అసోంలో 84.42శాతం, కేరళలో 77.45శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అస్సాంలో సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ ముగిసినా, కేరళ, పుదుచ్చేరిల్లో మాత్రం -మిగతా 2 లో






## ఈడెన్‌లో ముకుల్ చౌదరి సునామీ..!

- ఐపీఎల్‌లో కొత్త హీరో ఆవిర్భావం
- లక్నోను గెలిపించిన ముకుల్ చౌదరి
- కేకేఆర్‌పై బ్యాటింగ్‌లో విధ్వంసం

న్యూఢిల్లీ,

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సంచలన విజయం సాధించింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచులో చివరి బంతికి విజయం సాధించింది. ఓ దశలో 182 పరుగుల లక్ష్య ఛేదనలో ఓటమి అంచున నిలిచిన ఆ జట్టు.. 21 ఏళ్ల ముకుల్ చౌదరి అసాధారణ బ్యాటింగ్‌తో గెలుపుగీతను దాటింది. దీంతో ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు కేకేఆర్ నాలుగు మ్యాచులు ఆడినా.. ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది. 182 పరుగుల ఛేజింగ్‌తో బరిలోకి -మిగతా 2 లో

## బెంగాల్ మార్పు కోరుకుంటోంది..



- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం

2




## దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

- చిర,చరాస్థులు కూడా లేవు
- సొంత ఇల్లు అంతకన్నా లేదు
- బ్యాకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ

2

## రాఘవ్ చద్దా కొత్త పార్టీ?!



న్యూఢిల్లీ

ఆమ్ ఆద్మీ పార్టీ పక్కకు పెట్టిన ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా కొత్త రాజకీయ పార్టీని స్థాపించే సూచనలు కనిపిస్తున్నాయి! 'ఆసక్తికర ఆలోచన' పేరిట సామాజిక మాధ్యమాల్లో ఆయన షేర్ చేసిన వీడియో ప్రకారం వేరే పార్టీలో చేరే దాని కన్నా కొత్త పార్టీని స్థాపించడమే మేలన్న అభిప్రాయాన్ని ఆయన పంచుకున్నారు.సొంత పార్టీతో విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన ఈ విషయాన్ని పంచుకోవడం గమనార్హం. చద్దా తనకున్న ప్రజా మద్దతును నిలబెట్టుకోవాలంటే కొత్త పార్టీని పెట్టడమే మేలన్న ఓ కంటెంట్ క్రియేటర్ వీడియోను ఆయన తన ఖాతాలో పంచుకున్నారు.

## పొంగులేటి కాదు..పొంగులూటీ

- బాంబులు పేలుతాయన్న బాంబులేటి
- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు
- క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు
- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే ..హైడ్రా ఎందుకు వెళ్లలేదు
- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం

వనపర్తి,

పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు -మిగతా 2 లో



## జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం
- డిప్యూటి సిఎం భట్టి విక్రామర్క వెల్లడి

ఖమ్మం

కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

-మిగతా 2 లో



# ఈడెన్‌లో ముకుల్ చౌదరి సునామీ..!

మొదటి తరువాయి

దిగిన లక్నో సూపర్ జెయింట్స్.. ఆదిలోనే వికెట్లు కోల్పోయింది. మిచెల్ మార్ష్ (15), ఎయిడెన్ మార్‌క్రమ్ (22), రిషభ్ పంత్ (10) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. ఓ దశలో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన లక్నో.. విజయావకాశాలు సంక్లిష్టం చేసుకుంది. ఇలాంటి సమయంలోనే ముకుల్ చౌదరి అద్భుతం చేశాడు. అసాధారణ హిట్టింగ్‌తో కేకేఆర్‌కు మ్యాచును దూరం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో27 బంతులు ఎదుర్కొన్న ఈ 21 ఏళ్ల ప్లేయర్.. ఏకంగా ఏడు సిక్సర్లు బాదాడు. రెండు ఫోర్లు కూడా కొట్టాడు. దీంతో 200ల స్ట్రైక్ రేటుతో 54 రన్స్ చేసి.. జట్టును గెలిపించాడు. లక్నో విజయానికి చివరి 2 ఓవర్‌లలో 30 రన్స్ అవసరమయ్యాయి. ఈ సమయంలో కామెరూన్ గ్రీన్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ముకుల్ 16 రన్స్ రాబట్టాడు. చివరి ఓవర్ తొలి బంతికి ఆవేశ్ ఖాన్.. సింగిల్ తీశాడు. దీంతో స్ట్రైకింగ్‌లోకి వచ్చిన అతడు రెండో బంతిని స్టాండ్స్‌లోకి పంపించాడు. ఐదో బంతికి సైతం అదే శిక్ష వేశాడు. చివరి బంతికి ఒక్క పరుగు అవసరం కాగా.. బ్యాటుకు బంతి తాకకపోయినా ఇద్దరు బ్యాటర్లూ పరుగు పూర్తి చేశారు. దీంతో లక్నో టీమ్ సంబురాల్లో మునిగితేలింది. 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లలో ఎ.రఘువంశీ (33 బంతుల్లో 45 రన్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

-చిర,చరాస్థులు కూడా లేవు
-సొంత ఇల్లు అంతకన్నా లేదు
-బ్యాకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ



కోల్‌కతా,

మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముఖ్యమంత్రిగా దాదాపు పదిహేనేళ్లుగా కొనసాగుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆమెను అందరూ 'దీదీ' అని పిలుస్తారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికీ, ఆమె గడుపుతున్న నిరాడంబర జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోందని అంటున్నారు. ఇప్పటికీ తన పేరిట ఒక సొంత ఇల్లు, భూమి లేవని ఆమె వెల్లడించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భవానీ పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మమత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే సమయంలో కూడా ఆమె ఎప్పటిలాగే తన ట్రేడ్‌మార్క్ కాటన్ చీర, హవాయి చెప్పులతో ఎంతో సాదాసీదాగా కనిపించడం అందరినీ ఆకట్టుకుంది.మమతా బెనర్జీ అఫిడవిట్‌లో సమర్పించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్‌లో దీదీ పర్సనల్ ఖాతాలో సుమారు రూ.12.4లక్షలు ఉన్నాయి. ఎన్నికల ఖర్చుల కోసం అదే బ్యాంక్‌లో ఉన్న మరో ఖాతాలో రూ.40,000 ఉన్నాయి. అంటే మొత్తం బ్యాంకు నిల్వలు సుమారు రూ.13 లక్షలు. చేతిలో రూ.75,000 నగదు ఉన్నట్లు మమతా బెనర్జీ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీదీ వద్ద కేవలం 9.75గ్రాముల బంగారు ఆభరణాలు మాత్రమే ఉన్నాయి. 2021లో దాని విలువ రూ.88,887 ఉండగా, ప్రస్తుతం బంగారం రేటు పెరగడంతో రూ.1.75లక్షలకు పెరిగింది. మమత బెనర్జీకి సొంత ఇల్లు లేదు. ఎక్కడ వ్యవసాయ భూమి కానీ, నివాస స్థలాలు కానీ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని ఆమె తన అఫిడవిట్‌లో తెలిపారు.

# కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు సంబంధించిన ఏజెన్సీలన్నింటినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్లతో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందనీ, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకుని వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్నారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కల్గనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రిలయన్స్ రిటైల్ వాల్యుయేషన్ భళా

మొదటి తరువాయి

రూపొందించిన జాబితాలో ఈ మూడు కంపెనీల వాల్యుయేషనే మూడో వంతు వరకు ఉంది. ఇక మన దేశానికి చెందిన ఎన్ఎసఈ (2,400 కోట్ల డాలర్లు), టాటా ఈవీ మొబిలిటీ (900 కోట్ల డాలర్లు) 27, 93వ స్థానాల్లో నిలిచాయి.

# భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్

న్యూఢిల్లీ :




పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా ఇంధన సెగను పెంచుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 నుంచి 100 డాలర్ల మధ్య ఊగిసలాడటం భారత్‌కు అతిపెద్ద సవాలుగా మారిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. చమురు ధరలు పెరిగితే దేశీయంగా రవాణా భారమై, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని.. దీనివల్ల వృద్ధి రేటుపై ఒత్తిడి పడి 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.6 శాతానికి నెమ్మదించవచ్చని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. వాణిజ్యపరంగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులపై విధిస్తున్న భారీ టారిఫ్‌లు భారత ఎగుమతిదారులకు ప్రతిబంధకంగా మారాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో అస్థిరత ఏర్పడి, సరఫరా గొలుసు దెబ్బతినే అవకాశం ఉంది. ఇది ఎగుమతులపై ఆధారపడిన రంగాలను దెబ్బతీస్తూనే దిగుమతి చేసుకునే ముడి సరుకుల ఖర్చును పెంచి తయారీ రంగాన్ని ప్రతికూలతల్లోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి భారత్ వద్ద పటిష్టమైన విదేశీ మారక నిల్వలు, ఆర్థిక వెసులుబాటు ఉన్నప్పటికీ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే ఈ బఫర్స్ కరిగిపోయే ముప్పు పొంచి ఉంది.

# పోలింగ్ ప్రశాంతం

మొదటి తరువాయి

ఆరుగంటల వరకు అనుమతించారు. ఆ సమయానికి క్యూలో వున్న వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేసేందుకు అనుమతిచ్చారు.

**కేరళలో**

కేరళలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ సాఫీగా, సజావుగా సాగింది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 76శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుత ఎన్నికల్లో అంతకంటే అధికంగానే నమోదైంది. ఈసారి కోయకోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, పలువురు మంత్రులు, నటులు సహా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలో జెన్‌జీ పోలింగ్ బూత్ అందరినీ ఆకట్టుకుంది. తొలిసారి ఓటు వేసిన వారు సెల్ఫీ దిగేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. కాగా తొలిసారి ఓటు వేసిన వారందరికీ ఎన్నికల కమిషన్ 'స్వీట్ సర్‌ప్రైజ్' ఇచ్చింది. ప్రతి జిల్లాలో మొదటసారి ఓటు వేసిన 200మందికి హల్వా పంచింది.

ఎన్నికల అధికారి మృతి

అసోంలోని సోనిత్‌పూర్ జిల్లాలో ఎన్నికల అధికారి దేబెన్ హోరో (45) మరణించి వుండగా కనుగొన్నారు. ఆయన మరణానికి కారణమేంటో ఇంకా నిర్ధారించలేదు. నాడార్ నియోజకవర్గంలో రెండో పోలింగ్ అధికారిగా ఆయనను నియమించారు. గురువారం ఉదయం ఆయన మంచంపై స్పృహ లేకుండా పడి వుండగా చూశారు. వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించారని అధికారులు తెలిపారు.

పోలింగ్‌బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

పోలింగ్ బూత్‌ల్లో ఫోన్లు నిషిద్ధం. కేంద్రంలోకి వెళ్ళేముందు ఫోన్లు, బ్యాగ్‌లు సహా అన్ని వస్తువులను ఇచ్చి లోపలకు వెళ్లాలని ఈసీ కూడా స్పష్టంగా పేర్కొంది. కానీ అస్సాంలోని కర్బి అనగ్లాంగ్ జిల్లా యంత్రాంగం గురువారం ఇందుకు సంబంధించి ఫోలీసు ఫిర్యాదు చేసింది. ఒక పోలింగ్ స్టేషన్‌లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను చూపిస్తునట్లుగా వున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందని అధికారులు తెలిపారు. దిఫూ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లో తీసిన వీడియోగా భావిస్తున్నారు. వెంటనే దీనిపై విచారణకు ఆదేశించామని చెప్పారు. ప్రజా ప్రాతినిధ్యచట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేశారు.

పుదుచ్చేరిలో

పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాల్లోనూ భారీగా పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో ఇంత భారీ స్థాయిలో (86శాతం) ఓటింగ్ నమోదవడం 2006 తర్వాత ఇదే తొలిసారి. వీవీప్యాట్ యంత్రంలోని బ్యాటరీ నుంచి పొగ వస్తుండడంతో కరైకల్‌లో ఒక పోలింగ్ బూత్‌లో కాసేపు పోలింగ్ ఆగింది. ఆ బ్యాటరీని మార్చి కొత్తది పెట్టిన తర్వాత పోలింగ్‌ను పునరుద్ధరించారు.

వామపక్ష సంఘటనకు మళ్ళీ అధికారం

రాష్ట్రంలో వామపక్ష సంఘటన తిరిగి అధికారంలోకి వస్తుందని సీపీఐ కేరళం రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం పేర్కొన్నారు. వట్టియురకవులో తన ఓటు హక్కు వినియోగిం చుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను స్పష్టంగా అర్థం చేసుకున్న ప్రజలు తమ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, దేశ సార్వభౌమాధికారం వంటి కీలకమైన స్తంభాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి ఆందోళనలే ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. దేశంలో, అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితులను ప్రస్తావిస్తూ, యుద్ధ మేఘాల నడుమే ప్రజలు ఓటు వేసారన్నారు. వామపక్షాలే విశ్వసనీయమైన ప్రత్యామ్నాయమని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇచ్చే శుష్క వాగ్దానాలు కాకుండా నిరుపేదలకు ఆశ, భద్రత కల్పించేది వామపక్షాలేనని అన్నారు.

# బెంగాల్ మార్పు కోరుకుంటోంది.

- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం



న్యూఢిల్లీ,

పశ్చిమబెంగాల్ లోని హల్దియాలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ ( పార్టీపై విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో సీఎం మమతాబెనర్జి ఓటమిని గుర్తుచేస్తూ.. ఈసారి పశ్చిమబెంగాల్ రాష్ట్రం అంతటా అదే ఫలితం పునరావృతమవుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్ మార్పును కోరుకుంటోందని, ఈ క్రమంలో బీజేపీ భారీ విజయాన్ని చూస్తామని వ్యాఖ్యానించారు.నందిగ్రామ్‌లో ఐదేళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు భవానీపూర్‌తోపాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుందని ప్రధాని జోష్యం చెప్పారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తామని, బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవని మోదీ వ్యాఖ్యానించారు. ఒక్కసారి డబుల్-ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నానని అన్నారు. అన్యాయానికి గురైన ఆడబిడ్డల కేసులను తిరగదోడుతామని, అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతామని తెలిపారు. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ప్రధాని అన్నారు. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కల్పిస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతామని చెప్పారు. ఒక్కసారి బీజేపీ అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

# రేవంత్ కన్నా...కేసీఆర్ పాలనే బెటర్

మొదటి తరువాయి

భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనునున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

# పొంగులేటి కాదు..పొంగులూటీ

మొదటి తరువాయి

పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు.

అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్టును గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# ఎంత చెడ్డా-కుక్క తోక వంకరే

యుద్ధ విరమణ ఒప్పందాలు సాధారణంగా రెండు రకాలు: ఒకటి, కాల్పులు ఆగిపోయి ప్రాణాలు నిలిపేవి; రెండోది, ప్రచార ప్రయోజనాల కోసం తయారుచేసుకున్న కాగితపు పూతలు. ఇరాన్-అమెరికా మధ్య ఇటీవల కుదిరిన రెండు వారాల తాత్కాలిక కాల్పుల విరమణ రెండో కోవకు చెందినదే నన్న వాస్తవం, లెబనాన్ పై ఇజ్రాయెల్ తిరిగి విధ్వంసకాండకు దిగడంతో మళ్లీ నిరూపితమైంది. ఒక వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "మధ్యప్రాచ్యంలో సువర్ణాధ్యాయం" ప్రకటించగా, మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు "లెబనాన్ ఒప్పందంలో భాగం కాదు" అంటూ దాన్ని వమ్ము చేయడం ... ఈ వైరుధ్యమే ఈ ఒప్పందం యొక్క నిజస్వరూపాన్ని చాటిచెప్పింది. ఈ సంఘర్షణకు మూలం ఇరాన్ పై అణ్వాయుధాల నెపం అనేది విడ్డూరం. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్ రాఫెల్ మారియానో గ్రాసి స్పష్టంచేసినట్లుగా, "ఇరాన్ అణుబాంబు నిర్మిస్తున్నట్లు ఎటువంటి ఆధారాలు లేవు". ఇరాన్ వద్ద సుసంపన్నమైన యురేనియం నిల్వలు ఉండటం ఆందోళనకరమే అయినా, అది యుద్ధానికి సమర్థన కాదు. ఇజ్రాయెల్ స్వయంగా అణ్వాయుధాలను కలిగి ఉన్న దేశంగా ఉండడం ఎప్పుడూ జరగలేదు. కానీ అమెరికా ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకునే క్రమంలో... ఇరాన్ అంతర్జాతీయ తనిఖీలకు లోబడకపోవడం ఇక్కడి వైరుధ్యాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. ఐదు వారాల యుద్ధం యొక్క ఆర్థిక, మానవ వ్యయం అంచనాలకు మించింది. ప్రపంచ చమురు సరఫరాలో ఐదోవంతు హోర్ముజ్ జలసంధి గుండానే సాగుతుంది. ఈ మార్గం మూసివేత వలన ఫిబ్రవరిలో 469 మిలియన్ బారెళ్ళుగా ఉన్న గల్ఫ్ దేశాల మొత్తం ఎగుమతులు మార్చిలో 263 మిలియన్ బారెళ్ళ కు పడిపోయాయి. అంటే 206 మిలియన్ బారెళ్ళు నష్టం, ఇది దాదాపు 103 వీఎల్సీసీ సూపర్ ట్యాంకర్లను నింపగల సామర్థ్యం. ఇరాక్ ఎగుమతులు ఒక్కటే 94 మిలియన్ నుంచి 17 మిలియన్ బారెళ్ళకు క్షీణించడం ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని




చూపించింది. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్ ₹65 ఉన్న బ్రెంట్ క్రూడ్ ధర ఏప్రిల్ 2న ₹128కు చేరుకోవడం ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచింది. మానవ ప్రాణనష్టం మరింత దారుణంగా ఉంది. ఇరాన్ లో మాత్రమే 3,540 మంది మరణించారు, వారిలో 244 మంది పిల్లలు ఉన్నారు. లెబనాన్లో 1,503 మంది ప్రాణాలు కోల్పోయారు, 1.2 మిలియన్ల మంది (దేశ జనాభాలో ఐదోవంతు) స్థానభ్రంశం చెందారు. ఇజ్రాయెల్లో 33 మంది మరణించగా, అమెరికాకు 13 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా సైనిక నష్టం ₹3.5 బిలియన్లుగా అంచనా. ఇందులో ₹1.1 బిలియన్ విలువైన ఖతార్లోని రాడార్ వ్యవస్థ, ₹700 మిలియన్ల (ఏ.డబ్ల్యూ. ఏ.సీ.ఎస్.) విమానం నాశనం కూడా ఉన్నాయి. రష్యా పాత్ర ఈ సంఘర్షణలో మరో క్లిష్టమైన కోణం. ఉక్రెయిన్ గూఢచారి అంచనా ప్రకారం, మార్చి 21 నుంచి 31 వరకు రష్యన్ ఉపగ్రహాలు మధ్యప్రాచ్యంలోని 11 దేశాల్లో 46 సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, విమానాశ్రయాల సర్వే చేశాయి. ఈ సర్వే చేసిన కొద్ది రోజుల్లోనే ఇరాన్ ఆ లక్ష్యాలపై దాడులు చేసింది. రష్యా-ఇరాన్ మధ్య సైబర్ సహకారం కూడా పెరిగింది. టెలిగ్రామ్ ద్వారా రష్యన్ హ్యాకర్ గ్రూపులు

ఇరాన్ కు సాంకేతిక సహాయం అందిస్తున్నాయి. ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనకపోయినా, రష్యా పరోక్షంగా సంఘర్షణను ప్రోత్సహిస్తోంది. ఈ ఒప్పందంలోని ప్రాథమిక లోపం ఏమిటంటే ?... ఇరాన్-అమెరికా మధ్య చర్చలు జరుగుతుండగా, లెబనాన్, గాజా వంటి కీలక రంగాలను బేరసారాల నుంచి మినహాయించడం. నెతన్యాహు "ఇజ్రాయెల్ తన వేళ్లు ట్రిగ్గర్పైనే ఉంచుకుంటుంది" అంటూ చేసిన ప్రకటన ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్ నిబద్ధతను ప్రశ్నార్థకం చేస్తుంది. బుధవారం ఒక్కరోజే లెబనాన్లో 254 మంది మరణించారు, 1,165 మంది గాయపడ్డారు. దీనికి ప్రతిగా ఇరాన్ మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. ఇరాన్ ముందుకు తెచ్చిన పది సూత్రాల ప్రతిపాదన...అమెరికా బలగాల పూర్తి ఉపసంహరణ, అన్ని ఆంక్షల ఎత్తివేత, నష్టపరిహారం, లెబనాన్తో సహా అన్ని రంగాల్లో శాశ్వత కాల్పుల విరమణ... ఇవి చాలా వరకు సహేతుకంగా ఉన్నాయి. కానీ అమెరికా "ఇరాన్ యురేనియం సుసంపన్నం కొనసాగించడానికి అనుమతించదు" అంటూ నిరాకరించడంతో చర్చలు మళ్లీ క్లిష్టమయ్యాయి. ఈ సంఘర్షణ నుంచి ఒక స్పష్టమైన పాఠం కనపడుతుంది. యుద్ధాలను ప్రారంభించడం సులభం, కానీ ముగించడం అసాధ్యం కావచ్చు. "కుక్క తోక వంకరే" అన్న సామెత ఇక్కడ సార్థకమవుతుంది. ఈ ఒప్పందాలు ఎంత పెద్దగా ప్రకటించినా, ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకుంటే అవి కాగితాలపై మాత్రమే మిగిలిపోతాయి. ఇరాన్ సార్వభౌమత్వాన్ని గౌరవించడం, అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక వ్యవస్థను అన్ని దేశాలకు సమానంగా వర్తింపజేయడం, ప్రాంతీయ సమస్యలకు సమగ్ర పరిష్కారం కనుగొనటం, ఇవి లేని ఏ ఒప్పందమూ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని నిరూపించబడింది. ప్రపంచం దీర్ఘంగా ఊపిరి పీల్చుకుంది కానీ, ఆ ఊపిరి ఇంకా పూర్తిగా విడుదల కాలేదు. ఎందుకంటే, యుద్ధం ఆగిందనే భ్రమ కంటే ప్రమాదకరమైనది మరొకటి లేదు.

**– డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

---

## బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబ వేడుకలకు హాజరైన మురళీకృష్ణ యాదవ్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్ , 09 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు భువనేశ్వర్ రెడ్డి ఈ రోజు నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో, అలాగే కొందుర్గ్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి చెందిన వివాహ వేడుకలో బీఆర్ఎస్ యువనాయకులు వై. మురళీకృష్ణ యాదవ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ ప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వివాహ వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ కార్యకర్తల ఆనందాల్లో భాగస్వామ్యమవుతూ, వారి కుటుంబ కార్యక్రమాలకు హాజరై మద్దతుగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నటరాజన్, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, కౌన్సిలర్ ఎస్పీ శివ, సర్పంచ్ హరిశేఖర్, మాజీ కౌన్సిలర్ యుగంధర్, సీనియర్ నాయకులు వేణుగోపాల్, వీరేశం గుప్తా, రెడ్డి నర్సింలు, దర్గా రామచంద్రయ్య, మాజీ సర్పంచులు పల్లె శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మాణయ్య, నాయకులు రవి యాదవ్, నరసింహా రెడ్డి, డబ్బు పోచయ్య, శ్రీను, మల్లేష్, గుండు అశోక్, రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.


## ఎమ్మెల్సీ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి

### ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్ , 09 (జర్నలిస్ట్ డైరీ) :** ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలం లోని అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన సబ్జా అనసూయ,దివిటీ అంజయ్య,నాగుల నరసింహ,బుగ్గోనిగూడ గ్రామానికి చెందిన రాగులపల్లి జగన్,ఈదులపల్లి గ్రామానికి చెందిన రాళ్ల బండి పద్మమ్మ,మామిడిపల్లి గ్రామానికి చెందిన కారె సింధు ప్రియా,పిట్టలగూడ గ్రామానికి చెందిన గంగిశెట్టి పురుషోత్తం లకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కార్యాలయంలో లబ్ధిదారులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడిపల్లి సర్పంచ్ హన్మంత్ రెడ్డి,ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్,మామిడి పల్లి మాజీ ఎంపిటిసి కాట్న రవీందర్,పాపిరెడ్డి గూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జెకె నరసింహ,బుగ్గన గూడ మాజీ సర్పంచ్ రాజు,మామిడిపల్లి ఉపసర్పంచ్ మామిలపల్లి రాజు,మేకగూడ మాజీ ఉపసర్పంచ్ నర్సిములు,నాయకులు జయరాం గౌడ్,నర్సిమ గౌడ్ ,బండి మల్లయ్య,డివిటి నర్సింహా,సత్యనారాయణ,పురుషోత్తం రెడ్డి,శ్రవణ్ గౌడ్,వార్డు మెంబెర్స్ శ్రీపాల్ రెడ్డి, ప్రభు,మమతాకిరణ్ గౌడ్,ప్రభాకర్,అనిత అశోక్, మురళి,రాము,రవి,మల్లేష్ రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయని తాసిల్దార్ కార్యాలయం





**సమాచారం ఇవ్వకుండా దరఖాస్తుదారులను చుట్టూ తిప్పించుకుంటున్న అధికారులు**




**జర్నలిస్ట్ డైరీ చౌడపూర్, ఏప్రిల్ 09**
ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచేందుకు, ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం - 2005 చౌడపూర్ తహసీల్దార్ కార్యాలయంలో అపహాస్యమవుతోంది. నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులకు సమాచారం అందించడంలో ఇక్కడి అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. చట్టంపై కనీస అవగాహన లేకుండా వ్యవహరిస్తున్న ప్రజా సమాచార అధికారి (గ్రా×ఖా) తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.
ఆర్టీఐ చట్టం ప్రకారం, ఒక దరఖాస్తుదారుడు సమాచారం కోరినప్పుడు 30 రోజుల్లోగా పూర్తి వివరాలు అందించాలి. ఒకవేళ కోరిన సమాచారం వేరే విభాగానికి సంబంధించి ఉంటే, సెక్షన్ 6(3) ప్రకారం ఆ దరఖాస్తును సంబంధిత అధికారికి 5 రోజుల్లోగా బదిలీ చేయాలి. ఈ విషయాన్ని వెంటనే దరఖాస్తుదారునికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి. కానీ చౌడపూర్ తాసిల్దార్ కార్యాలయంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. దరఖాస్తు చేసుకున్న నెల రోజులు గడిచినా అధికారులు ఉలుకూ పలుకూ లేకుండా వ్యవహరిస్తున్నారు. బాధితులు పదేపదే ప్రశ్నిస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు. పైగా, "మీరు ఫలానా ఆఫీసుకు వెళ్లి తెచ్చుకోండి" అని బాధ్యతారహితంగా సమాధానం ఇస్తున్నారే తప్ప, చట్టబద్ధంగా దరఖాస్తును బదిలీ చేసినట్లు సమాచారం ఇవ్వడం లేదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పారదర్శకత ఉండేందుకు తీసుకొచ్చిన ఈ చట్టాన్ని కొందరు అధికారులు తమ నిర్లక్ష్యంతో నీరుగారుస్తున్నారు. కనీస అవగాహన లేని అధికారులు పీఐఓ (గ్రా×ఖా) హోదాలో ఉండి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని దరఖాస్తుదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల హక్కులను కాలరాస్తూ, సమాచారం ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం చట్టాన్ని ధిక్కరించడమే. చౌడపూర్ ఎమ్మార్వో కార్యాలయంలో నెలకొన్న ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి."ఆర్టీఐ చట్టం పట్ల అవగాహన లేకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు స్పందించి, చౌడపూర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, సమాచారాన్ని త్వరితగతిన అందేలా చూడాలని కోరుతున్నారు.

## షాద్ నగర్ మున్సిపాలిటీ 16వ వార్డులో క్రిస్టియన్ కాలనీ లో చిన్న కుంటబడి స్కూల్ ను అప్పర్ ప్రైమరీ స్కూల్ గా చేయాలి

### - 1 నుండి 7 వ తరగతి గా చేయాలనీ మండల విద్యాశాఖ అధికారికి మనోహర్ కు ఒగ్గు జయలక్ష్మి కిషోర్ కౌన్సిలర్ విజ్ఞప్తి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 09 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ మున్సపాలిటీ 16వ వార్డ్ క్రిస్టియన్ కాలనీ లో గల చిన్న కుంట బడిని 1 వ తరగతి నుండి 5 వ తరగతి కలదు కావున ఇట్టి స్కూల్ ను 1 వ తరగతి నుండి 7 వ తరగతి వరకు పొదగించాలని స్థానిక కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ మండల అధికారి వినతి పత్రం అందచేశారు గతంలో కూడా మాజీ వైస్ చేర్మెన్ నటరాజ్ మాజి కో అప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ ప్రతి పాధన చేసారు అప్పట్లో 16 లక్షల తో కాంపౌండ్ వాల్ నిర్మాణం స్కూల్ బెంచీలు వాష్ రూమ్స్ నిర్మించడం జరిగింది అని ఈ సందర్భంగా గుర్తు చేసారు IDBI బ్యాంక్ ద్వారా వాటర్ ప్లాంట్ మరియు కంప్యూటర్ లు కూడా ఏర్పాటు చేయడానికి కృషి చేశామని గుర్తు చేసారు వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఈసారి 2026-2027 అకాడమీక్ ఇయర్ అయినా అప్పర్ ప్రైమరి స్కూల్ గా ఏర్పాటు చేయాలనీ మండల విద్యాశాఖ అధికారికీ వినతి ప్రత్రం అందచేశారు.

# శివకుమార్‌కు బీఆర్ఎస్ సహాయం

### అంజయ్య యాదవ్ చొరవతో లక్ష రూపాయల LOC

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్ , 09 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ పట్టణం 20వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాజమోని శివకుమార్ నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స కోసం అవసరమైన సహాయం విషయాన్ని కౌన్సిలర్ పిన్నమోని గోపాల్, మాజీ ఎమ్మెల్యే



అంజయ్య యాదవ్ గారి దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్సీ వాణి దేవి సహకారంతో రూ. ఒక లక్ష రూజ మంజూరు చేయించారు. ఈ రోజు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేగూరి వేణుగోపాల్ లబ్ధిదారుడికి రూజ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చీపిరి రవి యాదవ్, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, ఎస్పీ శివ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# సేవే లక్ష్యం...20 ఏళ్లుగా చలివేంద్రంతో ప్రజలకు చల్లని నీడ

**బండారి రమేష్ సేవా స్ఫూర్తి-ఎండాకాలంలో ప్రజలకు ఊరట పోలీస్ స్టేషన్ ముందు ఘనంగా చలివేంద్రం ప్రారంభం**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్, 09 (జర్నలిస్ట్ డైరీ) :**
వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహాన్ని తీర్చే లక్ష్యంతో కళాబంధు బండారి రమేష్ గారు నిర్వహించిన చలివేంద్రం మరియు అంబలి కేంద్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చైర్మన్ అగ్గనూరు బస్వం, కౌన్సిలర్లు పెంటయ్య, ముబారక్ ఆలీ గార్లు హాజరై ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ ముందు జరిగిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల దృష్టిని ఆకర్షించింది.
గత 20 ఏళ్లుగా నిరంతరంగా చలివేంద్రాలు నిర్వహిస్తూ వస్తున్న రమేష్ గారి సేవలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి.
ముఖ్యంగా పేదలు, కార్మికులు, ప్రయాణికులకు వేసవిలో ఈ సేవ ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. ఆయన సేవా భావాన్ని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రశంసిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రముఖులు, సమాజానికి తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో గుర్రం రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పరందాములు, విద్యాసాగర్ రెడ్డి, శేఖర్, లయన్ కమ్మదనం సుధాకర్, నాగిళ్ళ గోపాల్ గుప్తా, డిస్కో సీను, మురళి, లింగమయ్య, పానుగంటి శశిధర్, రఘురామ చారి, గడ్డం వెంకటేష్, యంసాని శ్రీనివాస్, దుగ్గు శేఖర్, భద్రప్ప, గడ్డం కిషోర్, డా.రాచయ్య, సత్యనారాయణ సింగ్, మనోహర్ రాజ్, మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పరిగిలో అక్రమ కలప వ్యాపారంపై అటవీ శాఖ కొరడా





**జర్నలిస్ట్ డైరీ
పరిగి, ఏప్రిల్ 9**
వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని తుంకుల్ గడ్డ ప్రాంతంలో అక్రమంగా సాగుతున్న కలప వ్యాపారంపై అటవీ శాఖ అధికారులు మెరుపు దాడి చేశారు. గత తుంకుల్ గడ్డ ప్రాంతంలో అనుమతులు లేకుండా కలపను , అక్రమంగా రవాణా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పరిగి ఫారెస్ట్ ఆఫీసర్ తన బృందంతో కలిసి తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ వ్యాపారం సాగుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. వెంటనే స్పందించిన ఫారెస్ట్ ఆఫీసర్, అక్కడ ఉన్న కలపను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన కలపను పరిగి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు.

# భర్త చేసిన అప్పుకోసం భార్యకు శిక్ష

**-అంగన్వాడీ టీచర్ ను చెట్టుకు కట్టేసిన వైనం**



**నారాయణఖేడ్,ఏప్రిల్ 9
జర్నలిస్ట్ డైరీ**
అత్యాశకు పోయి భర్త చేసిన వ్యాపారానికి భార్యను శిక్షించారు కొందరు ప్రబుద్ధులు. వివరాలలోకి వెళితే కంగ్టి మండలం రాసోల్ గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ వసంతకుమారి భర్త ప్రభాకరరావు హెచ్.బి. ఎన్. అనే ప్రైవేట్ గొలుసుకట్టు లాంటి ఇన్సూరెన్స్ పాలసీ వ్యాపారం నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన ఈ సంస్థలో ఏజెంట్ గా చేరి ప్రజల చేత డబ్బులు కట్టిస్తే కాలపరిమితి తర్వాత కట్టిన డబ్బులకు రెట్టింపు ఇస్తామని కంపెనీ చెప్పడంతో ప్రభాకర్ రావు గ్రామంలో కొందరి దగ్గర డబ్బులు కట్టించి కంపెనీ రసీదు,బాండ్ కూడ ఇచ్చారు. కొన్ని ఏళ్ల తర్వాత ఎచ్.బి. ఎన్.కంపెనీ బోర్డు తిప్పేయడంతో డబ్బులు కట్టిన వారు ప్రభాకర్ రావు ఇంటిచుట్టూ తిరగడం ప్రారంభించారు. కంపెనీలో డబ్బులు పెట్టిన వారి బాధలు తట్టుకోలేక ప్రభాకర రావు కొన్ని ఏళ్ల క్రితం తన భార్య అంగన్వాడీ టీచర్ వసంతకుమారిని వదిలిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయారు. ఫైనాన్స్ పేరుతో మా వద్ద డబ్బులు తీసుకుని పారిపోయాడని భర్త ఆచూకీ తెలుపాలని బుధవారం వసంత కుమారిని చిత్రహింసలకు గురి చేస్తు చెట్టుకు కట్టేసి భయభ్రాంతులకు గురి చేశారు. భర్త చేసిన అప్పుల గురించి తనకు తెలియదని, అయినా కొన్నిరోజులు సమయం ఇస్తే తాను డబ్బులు చెల్లిస్తానని వసంత కుమారి ఎంత ప్రాధేయపడినప్పటికీ గ్రామస్థులు కనికరించక దాదాపు గంటకుపైగా ఆమెను చిత్రహింసలకు గురిచేస్తు చెట్టుకు కట్టేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కంగ్టి ఎస్సై దుర్గారెడ్డి తెలిపారు.

# ఎయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోండి



**చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి ఎయిడ్స్ వ్యాధి అవగాహన ర్యాలీ**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్ , 09 (జర్నలిస్ట్ డైరీ) :**
గురువారం నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమము హెల్త్ వీక్ లో భాగంగా, హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ వ్యాధి యొక్క అవగాహన ర్యాలీ డాక్టర్ స్రవంతి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీని హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు ఎయిడ్స్ వ్యాధి యొక్క స్లొగన్స్ చెబుతూ ర్యాలీని ముందుకు తీసుకెళ్లారు. ర్యాలీ అనంతరము డాక్టర్ స్రవంతి గారు మాట్లాడుతూ ఎయిడ్స్ (AIDS ) అంటే అక్వైర్డ్ ఇమ్యునో డెఫిషియన్సీ సిండ్రోమ్ అని, ఇది హెచ్.ఐ.వి (HIV) వైరస్ వలన వస్తుంది అని, ఇది ఒక వైరస్ వ్యాధి అని, ఈ వ్యాధి సోకిన వారిలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని డాక్టర్ స్రవంతి చెప్పారు. ఈ వ్యాధి యొక్క లక్షణాలు. కారణం లేకుండా బరువు తగ్గడం, తరచుగా జ్వరం రావడం, చెమటలు రావడం, సోషరశ గ్రంధులు వాచి ఉండటం, తరచూగా విరేచనాలు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, శరీరం పై తెల్లని పూత వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. వ్యాధి రాక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. సురక్షితమైన సెక్స్ పద్ధతులు అనుసరించడం, రక్త మార్పిడి చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం, సూదులు, సిరంజులు పంచుకోకపోవడం, వ్యక్తిగత వస్తువులు పంచుకోకపోవడం, హెచ్ఐవి పరీక్ష చేయించుకోవడం వట్టి జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్రవంతి గారు తెలిపారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్.ఐ.వి అనగా (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్) వైరస్ వలన సంక్రమిస్తుంది అని, ఈ వ్యాధి వ్యాప్తి చెందడానికి గల కారణాలు. 1)హెచ్.ఐ.వి సోకిన వ్యక్తితో అసురక్షిత సెక్స్ సంబంధాలు కలిగి ఉండడం వలన, 2).హెచ్.ఐ.వి సోకిన రక్తాన్ని మార్పిడి చేయడం వలన, 3).హెచ్.ఐ.వి సోకిన వ్యక్తి ఉపయోగించిన సూదులు , చిరంజీవిలు వాడటం వలన, 4).హెచ్.ఐ.వి సోకిన తల్లి నుండి గర్భంలో ఉన్న బిడ్డకు సంక్రమించవచ్చు అని, 5).ఒకరి కంటే ఎక్కువ మందితో సెక్స్ సంబంధాలు కలిగి ఉండడం వలన ఈ వ్యాధి వ్యాపిస్తుందని హెల్త్ ఎడ్యుకేటెర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, జే శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్, హెల్తు సూపర్వైజర్లు శ్రీరామ, చంద్రకళ, స్టాఫ్ నర్స్ సువర్ణ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, డీఈవో విజయ, ఏఎన్ఎంలు, ఆశాలు, కాంటిజెంట్ వర్కర్ శ్రీనివాస్ , మన్నెమ్మ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యం...20 ఏళ్లుగా చలివేంద్రంతో ప్రజలకు చల్లని నీడ

**బండారి రమేష్ సేవా స్ఫూర్తి -- ఎండాకాలంలో ప్రజలకు ఊరట పోలీస్ స్టేషన్ ముందు ఘనంగా చలివేంద్రం ప్రారంభం**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్, 09 (జర్నలిస్ట్ డైరీ) :**
వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహాన్ని తీర్చే లక్ష్యంతో కళాబంధు బండారి రమేష్ గారు నిర్వహించిన చలివేంద్రం మరియు అంబలి కేంద్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చైర్మన్ అగ్గనూరు బస్వం, కౌన్సిలర్లు పెంటయ్య, ముబారక్ ఆలీ గార్లు హాజరై ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ ముందు జరిగిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల దృష్టిని ఆకర్షించింది. గత 20 ఏళ్లుగా నిరంతరంగా చలివేంద్రాలు నిర్వహిస్తూ వస్తున్న రమేష్ గారి సేవలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి. ముఖ్యంగా పేదలు, కార్మికులు, ప్రయాణికులకు వేసవిలో ఈ సేవ ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. ఆయన సేవా భావాన్ని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రశంసిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రముఖులు, సమాజానికి తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో గుర్రం రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పరందాములు, విద్యాసాగర్ రెడ్డి, శేఖర్, లయన్ కమ్మదనం సుధాకర్, నాగిళ్ళ గోపాల్ గుప్తా, డిస్కో సీను, మురళి, లింగమయ్య, పానుగంటి శశిధర్, రఘురామ చారి, గడ్డం వెంకటేష్, యంసాని శ్రీనివాస్, దుగ్గు శేఖర్, భద్రప్ప, గడ్డం కిషోర్, డా.రాచయ్య, సత్యనారాయణ సింగ్, మనోహర్ రాజ్, మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత సమాజం కోసం ఐక్యంగా పోరాడుదాం

**- మంత్రి దామోదర రాజనర్సింహా పిలుపు**




**జర్నలిస్ట్ డైరీ**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఎయిడ్స్ పై అవగాహన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ మరియు మానవహారం కార్యక్రమంలో తెలంగాణ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ &టెక్నాలజీ శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, కలెక్టర్ నారాయణ రెడ్డి &వీనా లలిత దేవి తో కలిసి పాల్గొన్నారు.రాజ చైర్మన్ ఆరెకపూడి గాంధీఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...
సమాజంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, మానవ హారాలు, మెడికల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాం.
హెచ్ఐవీ అనేది మన శరీరంలోని రోగనిరోధక శక్తిని బలహీనపరచే వైరస్. చికిత్స తీసుకోకుండా ఉంటే అది ఎయిడ్స్‌గా మారుతుంది.
రక్షణలేని లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి తదితర కారణాలతో హెచ్ఐవీ వ్యాపిస్తుంది.
షేక్ హ్యాండ్, ఆలింగనం, కలిసి భోజనం చేయడం వంటి సాధారణ పరిచయాల ద్వారా హెచ్ఐవీ వ్యాపించదు. అవగాహన లేకపోవడం వల్లే భయాలు, అపోహలు, వివక్ష పెరుగుతున్నాయి --- అవగాహనే దీనికి సమాధానం.
హెచ్ఐవీ బాధితులను సామాజికంగా ఇబ్బంది పెట్టడం సరికాదు. వారికి కూడా గౌరవం, సహాయం, సమాన హక్కులు కల్పించాలి. హెచ్ఐవీ & ఎయిడ్స్ (నివారణ మరియు నియంత్రణ) చట్టం 2017 ప్రకారం, వివక్ష చూపడం చట్టరీత్యా నేరం. ఒకప్పుడు హెచ్ఐవీ ప్రాణాంతక వ్యాధి.. కానీ, ఇప్పుడు ప్రాణాంతక వ్యాధి కాదు. సమయానికి పరీక్షలు, సరైన చికిత్స తీసుకుంటే నాలుగైదు దశాబ్దాలు కూడా సాధారణ జీవితాన్ని గడపవచ్చు.

**ప్రభుత్వం ఉచితంగా టెస్టులు, చికిత్స, మెడిసిన అందిస్తోంది.**

రాష్ట్రవ్యాప్తంగా 127 టెస్టింగ్ సెంటర్లు, 33 ఆర్ట్ సెంటర్ల ద్వారా 1.14 లక్షల మంది పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్నాం. ముఖ్యంగా యువతకు ఒక సూచన సెడెంటరీ లైఫ్ స్టైల్‌బి అనారోగ్యకర అలవాట్లతో జీవితాన్ని పాడు చేసుకోకండి. ఆరోగ్యం లేకుంటే ఎంత మంచి సంపాదన ఉన్నా వృథానే.. డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. అది చాలా ప్రమాదకరం. మరీ ముఖ్యంగా ఇంజక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకోవడం వల్ల హెచ్ఐవీ, ఇతర రోగాలు వ్యాపించే ప్రమాదం ఉంది. వ్యక్తులు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. ఆరోగ్యవంతమైన కుటుంబాలతో..ఆరోగ్యవంతమైన సమాజం, బలమైన రాష్ట్రం నిర్మితమవుతాయి. మనందరం కలిసి మరింత వైబ్రంట్ తెలంగాణను తయారు చేసుకుందాం అని మంత్రి తెలియచేసారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఎయిడ్స్ పై అవగాహన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ మరియు మానవహారం ,మెడికల్ క్యాంప్ లు నిర్వహించడం జరుగుతుంది అని, సమాజంలో ఎయిడ్స్ పై అవవహన కలిగి ఉండలాని, ప్రతి ఒక్కరికి అవగహన కల్పించే బాధ్యత మనందరి పై ఉంది అని, యువత అనారోగ్యకర అలవాట్ల తో జీవితాన్ని పడుచేసుకోవద్దు అని, ఆరోగ్యమే మహా భాగ్యం అని తెలియచేసారు. ఆరోగ్యకరమైన జీవితమే బలమైన సమాజం నిర్మితమవుతుంది అని తెలియచేసారు.


# కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో రూ.40.50 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం

**- శంకుస్థాపన చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ, PAC చైర్మన్ గాంధీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రిల్ , 09 (జర్నలిస్ట్ డైరీ) :**
కొండాపూర్ జిల్లా ఆసుపత్రి లో రూ. 40 కోట్ల 50 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మించబోయే 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం భవనం నిర్మాణం పనులకు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య ,వైద్య కుటుంబ సంక్షేమ ,సైన్స్ ఉ టెక్నాలజీ శాఖామాత్యులు దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, DMHO లలిత దేవి, రాజేంద్రనగర్ RDO వెంకట్ రెడ్డి, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్లు హామీద్ పటేల్ గారు, నార్నె శ్రీనివాసరావు తో కలిసి శంకుస్థాపన చేసిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ. క్రిటికల్ కేర్ బ్లాక్ శంకుస్థాపనం తర్వాత.. కొండాపూర్ హాస్పిటల్, డయాగ్నస్టిక్స్ హబ్‌ను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ,ూజ చైర్మన్ గాంధీ సందర్శించారు. వైద్య సేవలు, ల్యాబ్ టెస్టులు, తదితర అంశాలపై పేషెంట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో రూ. 40 కోట్ల 50 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మించబోయే 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని మన నియోజకవర్గ ప్రజలకు, పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని , పేద ,మధ్యతరగతి ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స కు అవసరయ్యే నాణ్యమైన వైద్యం అందించే దిశగా ముందడుగు వేస్తున్నామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అన్ని హంగులతో ,సకల సౌకర్యాల తో నిర్మించి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని , నాణ్యత విషయం లో ఎక్కడా రాజీపడకూడదని పనులు త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్వో కార్యాలయం సందర్శించిన ఆర్డీవో గంగయ్య



**ఎలిగేడు, ఏప్రిల్ 9 జర్నలిస్ట్ డైరీ**
ఎలిగేడు ఎంఆర్వో కార్యాలయాన్ని గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, సాదా బైనామా దరఖాస్తుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను సత్వరమే ప్రారంభించాలని ఆదేశించారు. దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అమ్మిన పట్టాదారులకు నోటీసులు జారీ చేసి, అఫిడవిట్ సేకరించాలని సూచించారు. పారదర్శకంగా విచారణ జరిపి, ఏప్రిల్ 30లోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో భూక్య యాకన్న, డిప్యూటీ ఎంఆర్వో సిహెచ్. అనిల్ కుమార్, గిర్ధవార్లు జయలక్ష్మి, చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కింద చంచల్‌గూడ సెంట్రల్ జైలులో మెగా హెల్త్ క్యాంప్...











**-మూడు నెలలకు ఒకసారి అన్ని జైల్లో ఆరోగ్య పరీక్షలు..**
**- జై ల్ ఖాళీగా ఉన్న డాక్టర్ ఫార్మసిస్టులో త్వరలో భర్తీ చేస్తాం మంత్రి దామోదర్ రాజనర్సింహ..**

**జర్నలిస్ట్ డైరీ,చంచల్‌గూడ:**
రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా చంచల్‌గూడ సెంట్రల్ జైలులో మెగా హెల్త్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అన్ని 35 జైళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. జైళ్లలోని ఖైదీల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటుకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య, వైద్య -- కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజ నరసింహ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా, ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చోంగ్తు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, ఆరోగ్య -- కుటుంబ సంక్షేమ కమిషనర్, ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ డా. ఎస్. సంగీత సత్యనారాయణ, వైద్య విద్యా డైరెక్టర్ డా. ఏ. నరేంద్ర కుమార్; ప్రజా ఆరోగ్య డైరెక్టర్ డా. బి. రవీందర్ నాయక్; తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా. జె. అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జైళ్ల శాఖ ఐజీ శ్రీ ఎన్. మురళీ బాబు, డీఐజీ డా. డి. శ్రీనివాస్, చంచల్‌గూడ సూపరింటెండెంట్ శ్రీ ఎన్. శివకుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఫార్మసిస్టులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది విస్తృతంగా సేవలందించారు. మంత్రి తన ప్రసంగంలో జైళ్ల శాఖ ఆరోగ్య శాఖల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చి, ప్రతి మూడు నెలలకు ఒకసారి రాష్ట్రంలోని అన్ని జైళ్లలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో కార్డియాలజీ, షుగర్, బీపీ, ఈఎన్‌టీ, రక్తపరీక్షలు, చర్మవ్యాధులు, గైనకాలజీ తదితర సమగ్ర పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మాదకద్రవ్యాలు, మద్యాసక్తి లేదా విత్‌డ్రాయల్ సమస్యలతో బాధపడుతున్న ఖైదీలకు జిల్లా స్థాయి డీ--అడిక్షన్ కేంద్రాల్లో సరైన వైద్య చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జైళ్లలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఎంఎన్‌ఓలు, సైకియాట్రిస్టులు వంటి వైద్య పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని వెల్లడించారు. డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, త్రైమాసిక వైద్య శిబిరాల ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి సమయానుకూలంగా చికిత్స అందించవచ్చని తెలిపారు. ఖైదీలను జిల్లా డీ--అడిక్షన్ కేంద్రాలతో అనుసంధానం చేయడం ద్వారా పునరావాసం మెరుగుపడటంతో పాటు విత్‌డ్రాయల్ కారణంగా జరిగే మరణాలను తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమం జైళ్ల శాఖ, ఆరోగ్య శాఖ, నేషనల్ హెల్త్ మిషన్ మధ్య ఉన్న సమన్వయానికి నిదర్శనంగా నిలిచింది. జైళ్లలో అవసరమైన వైద్య సేవలను సమర్థవంతంగా అందించడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా మారింది. జైళ్ల శాఖ భద్రతతో పాటు మానవీయత, సంస్కరణల దిశగా కృషి కొనసాగిస్తామని పునరుద్ఘాటించింది. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వైద్య సిబ్బంది, అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు.

## హెల్మెట్ వినియోగంలో ఆదర్శంగా కొత్తపేట గ్రామం



**మహబూబాబాద్, ఏప్రిల్ 9 జర్నలిస్ట్ డైరీ**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో 24 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనే నియమాన్ని అమలు చేసింది. ఈ కెమెరాలను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సమ్మక్క--సారక్క దేవాలయం నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా, గ్రామ ప్రజలు, యువత హెల్మెట్లతో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కెమెరాలను ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడేలా చర్యలు తీసుకుంటామని, గంజాయి నిర్మూలనలో తమ వంతు పాత్ర పోషిస్తూ యువతను మంచి మార్గంలో నడిపించేలా కృషి చేస్తామని తెలిపారు. ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ, కొత్తపేట గ్రామం తీసుకున్న నిర్ణయం ఎంతో అభినందనీయమని, హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని, త్వరలోనే ఈ గ్రామాన్ని గంజాయి రహిత గ్రామంగా చూడాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్ఈడి స్క్రీన్ ద్వారా హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతపై అవగాహన వీడియోలు ప్రదర్శించగా, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బయ్యారం సీఐ రవీందర్, ఎస్ఐ తిరుపతి, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం

**దేవరకొండలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ నియోజకవర్గ స్థాయి జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం**




**దేవరకొండ, ఏప్రిల్ 09 జర్నలిస్ట్ డైరీ**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దేవరకొండ తహసీల్దార్ కార్యాలయంలో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026 ఏప్రిల్ 14న నిర్వహించబోయే నియోజకవర్గ స్థాయి జయంతి వేడుకల ఏర్పాట్లపై తహసీల్దార్ (వీ=ూ) మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఈ సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కరుణశ్రీ, సీఐ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ జయంతి వేడుకలను నియోజకవర్గస్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ శాఖ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ దళిత , ప్రజా సంఘాలు మరియు సంఘాల నాయకులు పాల్గొని వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు నాగరాజు, పుల్యా, పరంజ్యోతి, దిలీప్, పవన్ పాల్గొని విద్యార్థి వసతి గృహాల్లో నిర్వహించబోయే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సమీక్షా సమావేశంలో బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు, దేవయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు యేకుల సురేష్, అంకురి శివ, మద్దిమడుగు భిక్షపతి, కంబాల పల్లి వెంకటయ్య, ప్రసాద్, ఎర్ర అంజనేలు , పీటర్, లక్ష్మయ్య మరియు మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. జయంతి రోజున ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఘనంగా నివాళులర్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఆర్వో మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఉప్పల్ స్మశానవాటికలో గుర్తుతెలియని మృతదేహం



**ఉప్పల్, ఏప్రిల్ 9 జర్నలిస్ట్ డైరీ**
ఉప్పల్ బీరప్పగడ్డ స్మశానవాటికలో అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని పురుషుని మృతదేహం లభ్యమైంది. స్మశానవాటిక పరిసరాల్లో దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం మృతుడు వయసు 30--35 సంవత్సరాలు ఉండవచ్చని, శవం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు

# పిండి పదార్థాలను తినడం పూర్తిగా మానేస్తే ఏమవుతుంది..?



కార్బోహైడ్రేట్లు శరీరానికి ప్రధాన శక్తి వనరు. రోజువారీ పనులను చేయడానికి అవసరమైన ఎనర్జీని ఇవే అందిస్తాయి. వీటిని తీసుకున్నప్పుడు అవి మొదట జీర్ణవ్యవస్థలో విచ్ఛిన్నమై గ్లూకోజ్‌గా మారి రక్తంలో కలుస్తాయి. దీనినే బ్లడ్ షుగర్ అని అంటారు. తర్వాత శరీరం ఇన్సులిన్‌ను విడుదల చేసి ఆ గ్లూకోజ్‌ను కణాలకు చేరవేసి శక్తిగా ఉపయోగిస్తుంది. అదనంగా ఉన్న గ్లూకోజ్‌ను కాలేయం, కండరాల్లో నిల్వ చేస్తుంది. అవి కూడా నిండిపోయినప్పుడు, మిగిలిన గ్లూకోజ్‌ను కొవ్వుగా మారుస్తుంది. అందువల్ల పిండి పదార్థాలను అధికంగా తీసుకుంటే బ్లడ్ షుగర్ పెరగడం, ఫ్యాట్ నిల్వ కావడం జరుగుతుంది. ఈ కారణాలతోనే చాలా మంది కార్బ్స్ (పిండి పదార్థాలు) తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కార్బ్స్‌ను పూర్తిగా మానేయడం లేదా చాలా తక్కువగా తీసుకోవడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశం ఉంది. శరీరం తక్షణ గ్లూకోజ్‌పై ఆధారపడటం నుంచి కొవ్వును శక్తిగా ఉపయోగించే విధానానికి మారుతుంది. ఈ మార్పు వల్ల కొన్ని లాభాలు ఉన్నప్పటికీ, కొన్ని దుష్ప్రభావాలు కూడా కనిపించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

**శరీరంలోని శక్తి నిల్వ గ్లైకోజెన్..**

కాలేయం, కండరాల్లో కార్బోహైడ్రేట్లు గ్లైకోజెన్ రూపంలో నిల్వ ఉంటాయి. ప్రతి గ్రాము గ్లైకోజెన్‌తో సుమారు మూడు గ్రాముల నీరు కూడా నిల్వ ఉంటుంది. కార్బ్స్ తగ్గించినప్పుడు ఈ నిల్వలు ఒకటి నుంచి రెండు రోజుల్లో తగ్గిపోతాయి. దీనివల్ల మొదట బరువు త్వరగా తగ్గినట్లుగా అనిపిస్తుంది. కానీ ఇది నీటి కోత కారణంగా జరుగుతుంది. నీటి లోపం వల్ల డీహైడ్రేషన్ వచ్చే ప్రమాదం ఉంది. అలాగే ఈ దశలో ఎనర్జీ కూడా తగ్గుతుంది. గ్లైకోజెన్ నిల్వలు తగ్గిన తర్వాత శరీరం కొవ్వు నుంచి కీటోన్స్‌ను ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తుంది. దీనిని కీటోసిస్ అంటారు. ఈ దశలో శరీరం కొవ్వును ప్రధాన శక్తిగా ఉపయోగిస్తుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అయితే ప్రారంభంలో కీటో ఫ్లూ అని పిలిచే లక్షణాలు కనిపిస్తాయి. అలసట, మలబద్ధకం, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయి. మెదడు ఎక్కువగా గ్లూకోజ్‌ను ఉపయోగిస్తుంది. కానీ కార్బ్స్ తగ్గించినప్పుడు మొదటి వారంలో ఏకాగ్రత లోపం, మతిమరుపు, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనినే బ్రెయిన్ ఫాగ్ అంటారు. అయితే రెండు వారాల తర్వాత శరీరం కీటోన్స్‌ను సరిగ్గా వినియోగించడం నేర్చుకుంటుంది. దీంతో మళ్లీ మెదడు పనితీరు మెరుగవుతుంది.

**ఈ సమస్యలు వచ్చే అవకాశం..**

కార్బ్స్ తగ్గించడం వల్ల బ్లడ్ షుగర్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇన్సులిన్ సున్నితత్వం మెరుగవుతుంది. దీనివల్ల ఆకలి తగ్గి, స్వీట్ తినాలనే కోరిక కూడా తగ్గుతుంది. దీర్ఘకాలంలో డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అయితే గ్లైకోజెన్ తగ్గడం వల్ల నీరు, ఎలక్ట్రోలైట్స్ కూడా తగ్గిపోతాయి. దీంతో కండరాల్లో నొప్పులు, ముడుచుకోవడం, క్రాంప్స్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రిపూట లేదా వ్యాయామం సమయంలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే పొటాషియం, మెగ్నీషియం ఉన్న ఆహారం తీసుకోవడం అవసరం. ఇక కార్బ్స్ తగ్గించడం వల్ల ఇన్సులిన్ స్థాయిలు తగ్గి,ాజుూూ వంటి సమస్యల్లో కొంత ఉపశమనం లభిస్తుంది. అయితే ఒక్కసారిగా కార్బ్స్‌ను ఎక్కువగా తగ్గిస్తే కార్టిసోల్ పెరిగి ఒత్తిడి పెరగవచ్చు. దీని ప్రభావంగా జుట్టు రాలడం, నిద్ర సమస్యలు రావచ్చు. థైరాయిడ్ పనితీరు కూడా కొంత మందగించవచ్చు. కార్బోహైడ్రేట్స్ ను తగ్గించడం మంచిదే అయినప్పటికీ వీటిని పూర్తిగా మానేయడం కన్నా సమతుల్యంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.




# రాత్రిపూట పండ్లు తింటే గుండెపోటు వస్తుందా?

## నిపుణులు తేల్చి చెప్పిన పచ్చి నిజం ఇదే!

మొక్కలు రాత్రిపూట శ్వాసక్రియలో భాగంగా కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయనేది ప్రాథమిక విజ్ఞానం. అయితే, మనం తినే పండ్లు లేదా కోసిన సలాడ్‌ల నుండి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్ పరిమాణం చాలా స్వల్పం. ఇది మానవ శరీరంలో గుండెపోటు కలిగించేంత స్థాయిలో అస్సలు ఉండదు. మన శరీరంలో కార్బన్ డయాక్సైడ్ పెరిగి గుండెపోటు వస్తుందనే వాదన పూర్తిగా అవాస్తవం.

2. గుండెపోటుకు అసలు కారణాలు: గుండెపోటు అనేది అకస్మాత్తుగా వచ్చేది కాదు, అది మన జీవనశైలి మార్పుల వల్ల సంభవిస్తుంది. నిపుణులు చెబుతున్న ప్రధాన కారణాలివే:

**అధిక LDL కొలెస్ట్రాల్:** రక్త నాళాల్లో కొవ్వు పేరుకుపోవడం.

**ధూమపానం మరియు మద్యపానం:** గుండె కండరాలను బలహీనపరుస్తాయి.


**ఒత్తిడి :** నిరంతర మానసిక ఒత్తిడి గుండెపై భారాన్ని పెంచుతుంది.

**అసమతుల్య ఆహారం:** నూనె పదార్థాలు, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం.

రాత్రిపూట పండ్లు తినవచ్చా? రాత్రిపూట పండ్లు తినడం వల్ల గుండెపోటు రాదు, కానీ కొంతమందికి జీర్ణక్రియ సమస్యలు (అసిడిటీ లేదా గ్యాస్) రావచ్చు. పండ్లలో ఉండే చక్కెర వల్ల కొందరికి నిద్రలో ఇబ్బంది కలగవచ్చు. అందుకే నిద్రపోవడానికి కనీసం 2-3 గంటల ముందే ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకండి. పండ్లు మరియు కూరగాయలు శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సరైన బరువు నిర్వహించడం మరియు ఒత్తిడికి దూరంగా ఉండటం ముఖ్యం.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. ఆరోగ్యానికి సంబంధించిన ఏవైనా సందేహాలు ఉంటే అర్హత కలిగిన పోషకాహార నిపుణులు లేదా వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

# మూడు వేల అడుగులతో రక్తపోటు నియంత్రణ



**వాషింగ్టన్ :**
రోజుకు మూడువేల అడుగులు వేస్తే రక్తపోటు నియంత్రణలో ఉంటుందని, అధిక రక్తపోటును తగ్గించవచ్చని తాజా అధ్యయనం కనుగొంది. రక్తపోటు నిపుణుడు అయిన పెస్కాటెల్లో.. అయోవా స్టేట్ యూనివర్సిటీలో డక్ చున్ లీ ల్యాబ్‌లో ఎలిజబెత్ లెఫెర్ట్స్ అనే మరికొంతమంది పరిశోధకులతో కలిసి ఈ అధ్యయనం చేశారు. రక్తపోటుకు సంబంధించి వారు చేసిన ఈ పరిశోధన జర్నల్ ఆఫ్ కార్డియోవాస్కులర్ డెవలప్‌మెంట్ అండ్ డిసీజ్‌లో ప్రచురితమైంది. వయసుపైబడిన వారు అధిక రక్తపోటుతో బాధపడుతుంటారు. వీరు ఈ వయసులో రోజూ చేసే వాకింగ్ సమయాన్ని పెంచడం వల్ల వారికి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయా లేదా అన్న కోణంలో ఈ పరిశోధన చేశారు. అయితే తాజా అధ్యయనానికి ముందు రోజుకు సగటున నాలుగు వేల అడుగులు వేసిన వృద్ధులపై అధ్యయనం చేశారు. అయితే నాలుగువేల అడుగులు అంటే మరీ ఎక్కువ సమయం పడుతుండటంతో ఎక్కువ శారీరక శ్రమ వల్ల వారు అలసటకు గురయ్యే అవకాశం ఉంది. అందుకని రక్తపోటు నియంత్రణకు రోజుకు సగటున 3 వేల అడుగులు నడవడం సహేతుక లక్ష్యమని పరిశోధకులు నిర్ణయించారు. కోవిడ్ మహమ్మారి ఉన్న సమయంలోనే ఈ అధ్యయనాన్ని నిర్వహించినట్లు వ రి శో ధ క ు లు చెప్పారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వృద్ధులకు పెడోమీటర్లు, రక్తపోటు మానిటర్లు, స్టెప్ డైరీలతో కూడి ఓ కిట్‌ను పరిశోధకులు వారికిచ్చారు. రోజూ వారు ఎన్ని వేల అడుగులు వేస్తున్నారో పరిశీలించారు. ఇందులో పాల్గొన్న 21 మందిలో ఎనిమిది మంది అధిక రక్తపోటు నిరోధక మందులు వాడుతున్నారు. వీరంతా రోజూ చేసే వాకింగ్ సమయాన్ని మరికొంతసేపు పెంచడం వల్ల.. రక్తపోటు నియంత్రణలో ఉందని పరిశోధకులు గమనించారు. ఈ అధ్యయనంలో రక్తపోటు నియంత్రణకు శారీరక శ్రమ ముఖ్యమని పరిశోధకులు కనుగొన్నారు.



# ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తింటే శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా..?

## అస్సలు ఊహించలేరు..

నేటి ఉరుకుల పరుగుల జీవితం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఇంటింటికీ సాధారణమైపోయాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందడానికి చాలామంది రకరకాల మందులు వాడుతుంటారు. అయితే వీటన్నింటికంటే ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తినడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తాజా వైద్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సుమారు 184 మందిపై నిర్వహించిన ఒక అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశోధకులు వీరిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి ప్రతిరోజూ రెండు కివీ పండ్లు, మరో బృందానికి ఇసబ్గోల్ లేదా సైలియం పొట్టు ఇచ్చారు. నాలుగు వారాల తర్వాత చూస్తే.. కివీ పండ్లు తిన్నవారిలో జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, కడుపునొప్పి, ఒత్తిడి వంటి సమస్యలు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు.

**జీర్ణ వ్యవస్థకు సంజీవని**

కివీ పండులో ఉండే యాక్టినిడిన్ అనే ఎంజైమ్, అధిక ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే కరిగే ప్రీబయోటిక్ ఫైబర్ ప్రేగులలోని మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడి, కడుపును ఆరోగ్యంగా ఉంచుతుంది.

**రోగనిరోధక శక్తికి కేరాఫ్ అడ్రస్**

కేవలం జీర్ణక్రియకే కాదు, కివీ పండు రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా మేటి. కివీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది జలుబు, దగ్గు వంటి అంటువ్యాధుల నుండి రక్షణ ఇస్తుంది. రోజూ రెండు గోల్డెన్ కివీ పండ్లు తినే వృద్ధులలో గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని, ఒకవేళ అనారోగ్యం సోకినా వారు చాలా వేగంగా కోలుకుంటారని అధ్యయనం తేల్చింది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

బరువు నియంత్రణ: తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక.

కంటి చూపు: కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ల్యూటిన్, జీక్సాంథిన్ వంటి మూలకాలు కివీలో ఉన్నాయి.

చర్మ సౌందర్యం: యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి.

**జాగ్రత్తలు తప్పనిసరి**

కివీలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నా, కొందరికి ఇది అలెర్జీని కలిగించవచ్చు. నోరు వాపు లేదా దురద వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. మొదట్లో తక్కువ పరిమాణంలో తింటూ మీ శరీరానికి ఇది పడుతుందో లేదో చూసుకోవడం మంచిది.

# బిజినెస్

## కుప్పకూలిన బంగారం ధరలు..

**-ఒక్కసారిగా బిగ్ క్రాష్.. లేటెస్ట్ ధరలు ఇవే..**

బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి భారీ గుడ్ న్యూస్. ధరలు గంటల వ్యవధిలోనే భారీగా తగ్గుదల నమోదు చేశాయి. ఒక్కసారిగా ధరలు పతనం కావడంతో కొనుగోలుదారులకు ఊరట కలిగినట్లయింది. హర్మూజ్ జలసంధిని తిరిగి మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన క్రమంలో స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నాయి. అలాగే బంగారం ధరలపై కూడా దీని ప్రభావం పడింది. గురువారం బంగారం రేట్లు క్రాష్ అవ్వగా.. లేటెస్ట్ ధరలు ఎలా ఉన్నాయో ఒకసారి చూద్దాం.హైదరాబాద్‌లో 10 గ్రాములు 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,480 వద్ద కొనసాగుతోంది. బుధవారం ఆ ధర రూ.1,53,820 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.2340 తగ్గిపోయింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,38,850గా ఉండగా.. నిన్న



రూ.1,41,000 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.2150 పడిపోయింది.విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,730 వద్ద ఉండగా.. బుధవారం రూ.1,54,910గా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.2180 డౌన్ అయింది. ఇక 22 క్యారెట్ల ధర ఇప్పుడు రూ.1,40,000గా ఉండగా.. నిన్న రూ.1,42,000గా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.2 వేలు తగ్గిందని చెప్పవచ్చు.దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రేటు రూ.1,51,630 వద్ద ఉండగా.. నిన్న రూ.1,53,970గా ఉంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,000గా ఉంది. నిన్న ఇది రూ.1,41,150 వద్ద స్థిరపడింది. ఇక బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రేటు రూ.1,51,480 వద్ద ఉండగా.. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1,38,850 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి ధరలు కూడా పడిపోయాయి. బెంగళూరులో కేజీ వెండి రూ.2.55 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.60 లక్షలుగా ఉంది. ఇక హైదరాబాద్‌లో ప్రస్తుతం రూ.2.60 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.65 లక్షల వద్ద స్థిరపడింది.

## భారత వృద్ధి రేటు అంచనా 6.6శాతం : ప్రపంచబ్యాంక్




**న్యూఢిల్లీ :**
2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాలను స్వల్పంగా పెంచి 6.6 శాతానికి సవరించినట్లు ప్రపంచబ్యాంక్ తెలిపింది. ప్రారంభంలో జిఎస్‌టి రేట్ల తగ్గింపు వినియోగదారుల డిమాండ్‌ను పెంచినప్పటికీ పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులు వృద్ధిలో కోత విధించవచ్చని పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వృద్ధి అంచనాలను ఆర్‌బిఐ 6.9శాతం, ఒఇసిడి 6.1శాతం, మూడీస్ రేటింగ్స్ 6శాతంగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ బ్యాంక్ బుధవారం 'దక్షిణాసియా ఆర్థిక నివేదిక'ను విడుదల చేసింది. బలమైన దేశీయ డిమాండ్, ఎగుమతుల పటిష్టత కారణంగా, భారతదేశ వృద్ధి రేటు 2025లో నమోదైన 7.1శాతం నుండి 2026 ఆర్థిక సంవత్సరంలో 7.6శాతానికి వేగవంతమవుతుందని అంచనా వేసింది. తక్కువ ద్రవ్యోల్బణం, వస్తు సేవల పన్ను ( జిఎస్‌టి) క్రమబద్ధీకరణతో వ్యక్తిగత వినియోగ వృద్ధి వేగవంతమైందని పేర్కొంది. "పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్న ప్రతికూలతల కారణంగా 2027 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.6శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నాము" అని నివేదిక పేర్కొంది.

## డిస్నీలో 1,000 మంది ఉద్యోగులపై వేటు..

**వాషింగ్టన్**
ప్రముఖ వినోద రంగ దిగ్గజం వాల్ట్ డిస్నీ రానున్న వారాల్లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. ఈ తొలగింపులు ప్రధానంగా కంపెనీ మార్కెటింగ్ విభాగంపై ప్రభావం చూపనున్నాయి. గత మార్చిలో డిస్నీ సిఇఒగా జోష్ డి అమరో బాధ్యతలు చేపట్టకముందే ఈ కోతలకు సంబంధించిన ప్రణాళికలు మొదలైనట్లు సమాచారం. ప్రస్తుతం డిస్నీలో దాదాపు 2,31,000 మంది ఉద్యోగులు ఉండగా.. తాజా నిర్ణయం మొత్తం సిబ్బందిలో 1 శాతం కంటే తక్కువ మందిపై ప్రభావం చూపనుంది. కంపెనీ ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా ప్రాజెక్ట్




## చెన్నై జట్టును తక్కువ అంచనా వేయలేం

**సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్**


ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే 13 మ్యాచ్‌లు ముగియగా, జట్ల మధ్య పోరు హోరాహోరీగా మారుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ , చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు అందరి ఫోకస్ ఎంఎస్ ధోనీపైనే ఉంది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ చెన్నై జట్టుపై చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ధోనీ లేకపోవడం సీఎస్కే బలాన్ని తగ్గిస్తుందని తాను భావించడం లేదని క్లాసెన్ స్పష్టం చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉందని, వారు ఎప్పుడూ పటిష్ఠమైన జట్టుగానే బరిలోకి దిగుతారని హెన్రిచ్ క్లాసెన్ పేర్కొన్నారు. "ధోనీ మైదానంలో లేనంత మాత్రాన ఆ జట్టు బలహీనపడదు. వారి సెటప్‌లో ఉన్న ప్రతి ఆటగాడు ప్రతిభావంతుడే. విదేశీ



ఆటగాళ్లతో పాటు స్వదేశీ కుర్రాళ్లు కూడా మ్యాచ్‌ను గెలిపించగలరు" అని క్లాసెన్ అభిప్రాయపడ్డారు. జియోస్టార్ ప్రెస్ రూమ్‌లో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన సీఎస్కే జట్టుపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ధోనీ లేకపోవడం వల్ల తమ పని సులభం అవుతుందని తాము అనుకోవడం లేదని ఆయన తెలిపారు.చెన్నై సూపర్ కింగ్స్ జట్టును మరో కీలక ఆటగాడి రాకతో మరింత బలం పెరిగినట్లయ్యింది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ గాయం నుంచి కోలుకుని జట్టుతో చేరబోతున్నాడని క్లాసెన్ వెల్లడించారు. ధోనీలాగే బ్రెవిస్ కూడా ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడటం వల్ల మొదటి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. బ్రెవిస్ మిడిల్ ఆర్డర్‌లో వస్తే చెన్నై బ్యాటింగ్ మరింత బలోపేతం అవుతుందని, అది తమ బౌలర్లకు సవాల్‌గా మారుతుందని క్లాసెన్ చెప్పుకొచ్చారు. క్లాసెన్ తన సొంత దేశపు ఆటగాడైన బ్రెవిస్ సామర్థ్యం గురించి మేనేజ్‌మెంట్‌ను హెచ్చరించారు.చెన్నై జట్టు టాప్ ఆర్డర్ గురించి మాట్లాడుతూ క్లాసెన్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కొత్తగా జట్టులో చేరిన సంజు శామ్సన్ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేదు. అయితే ఇలాంటి క్లాస్ ప్లేయర్లు ఎప్పుడైనా ఫామ్ అందుకునే అవకాశం ఉందని, వారు ఫామ్ లోకి వస్తే ఆపడం చాలా కష్టమని అన్నారు. వారు తమపై జరిగే మ్యాచ్‌లో కూడా ఫెయిల్ కావాలని తాము కోరుకుంటున్నామని, తద్వారా చెన్నైని ఒత్తిడిలోకి నెట్టవచ్చని క్లాసెన్ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

## ఐపీఎల్‌లో సరికొత్త రూల్!

సాధారణంగా ఐపీల్ మ్యాచ్‌ల సమయంలో డగౌట్‌లో ఉండే ఆటగాళ్లు పదే పే మైదానంలోకి రావడం చూస్తూనే ఉంటాం. డ్రింక్స్ అందించడానికో, బ్యాట్లు మార్చడానికో, లేదా కోచ్ చెప్పే సమాచారాన్ని చేరవేయడానికో వస్తూ ఉంటారు. అయితే దీని వల్ల మ్యాచ్ సమయం వృథా అవుతుందని గ్రహించిన బీసీసీ సరికొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లో మార్పులు చేసింది. బీసీసీఐ తాజాగా ఫ్రాంచైజీలకు పంపిన సమాచారం ప్రకారం... మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇచ్చిన టీమ్ షీట్‌లో చెప్పిన 16 మంది ఆటగాళ్లకు మాత్రమే అంటే 11మంది జట్టు సభ్యులు ఐదుగురు సబ్‌స్టిట్యూట్లకు మాత్రమే మైదానంతో సంబంధం ఉంటుంది. ఈ 16 మందిలో లేని మిగతా స్క్వాడ్ సభ్యులలు ఎవరూ కూడా ఆట జరుగుతున్న సమయంలో మైదానంలోకి అడుగు పెట్టడానికి లేదు. సాధారణంగా రిజర్వ్ ప్లేయర్లు డ్రింక్స్ లేదా సమాచారాన్ని తీసుకెళ్తుంటారు. కానీ కొత్త రూల్స్ ప్రకారం టీమ్ షీట్‌లో లేని ఆటగాళ్లు డ్రింక్స్, బ్యాట్లు



లేదా ఎలాంటి సందేశాలు పట్టుకొని రావడానికి లేదు. మ్యాచ్ జరుగుతున్న టైంలో కేవలం ఐదుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు మాత్రమే మైదానం చుట్టూ తిరగడానికి అనుమతి ఉంటుంది. మిగిలిన వారు కచ్చితంగా డగౌట్‌కే పరిమితం కావాలి. వారు బౌండరీ లైన్, ఎల్‌ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల మధ్య తిరగడానికి లేదు. మైదానం లోపల లేదా బౌండరీ పరిసరాల్లో ఉండే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు కచ్చితంగా టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించాలి. ఇది వారి ఆడుతున్న ఆటగాళ్ల నుంచి వేరుగా గుర్తించడానికి సహాయపడుతుంది. ఈ కొత్త మార్పులు ఇప్పటికే ఉన్న మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లోని క్లాజ్ 11.5.2, 24. 1.4లకు అదనంగా చేర్చారు. క్లాజ్ 11.5.2 ప్రకారం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే సమయం వృథా కాకుండా డ్రింక్స్ అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా కూల్స్ డ్రింక్స్ మైదానంలోకి తీసుకురాకూడదు. క్లాజ్ 24.1.4 ప్రకారం మ్యాచ్‌లో ఆడని ఆటగాళ్లు మైదాన ప్రాంతంలో ఉన్నప్పుడు తప్పనిసరిగా బిబ్స్ ధరించాలని స్పష్టం చేస్తుంది. ఈ రూల్ వల్ల జట్ల వ్యూహాలై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా క్లిష్ట సమయంలో డగౌట్ నుంచి ఆటగాళ్లు సందేశాలు పంపడం ఇప్పుడు కొంత కష్టతరం కావచ్చు. కేవలం నిర్ణీత 16 మంది ద్వారానే కమ్యూనికేషన్ జరగాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ఆదేశాలను ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అన్ని ఫ్రాంచైజీలకు చేరవేసింది.

# స్పోర్ట్స్

## క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్.. తొలి రౌండ్‌లోనే సింధు, ప్రణయ్ ఇంటికి..!



భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి అదుర్స్ అనిపించాడు. ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ లో సీనియర్లు తేలిపోగా.. ఈ కుర్రాడు మాత్రం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం చీ యు జెన్(చైనీస్ తైపీ)ను చిత్తు చేసిన ఆయుశ్ టైటిల్‌పై ఆశలు రేపుతూ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌హెచ్ ప్రణయ్ చేతులెత్తేయగా.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు సైతం మొదటి రౌండ్‌లో ఓటమితో ఇంటిదారి పట్టింది.చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు తొలి రౌండ్‌లో, హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించారు.ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఆడలేకపోయిన సింధు ఈ టోర్నీలో మెరుస్తుందనుకుంటే.. వరల్డ్ నంబర్ 2 ధాటికి మొదటి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. రెండు సెట్లలో పోరాడిన తెలుగు తేజాన్ని వాంగ్ జీ యీ 21-18, 21-18తో మట్టికరిపించింది. తొలి రౌండ్‌లో అదరగొట్టిన ప్రణయ్‌ను చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్ 21-12, 21-19తో సులువుగా ఓడించాడు.

**ఆయుశ్ తగ్గేదేలే..**
సీనియర్లు విఫలమైన చోట ఇరవై ఏళ్ల ఆయుశ్ ప్రత్యర్థికి దడ పుట్టించాడు. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ ఈసారి 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించిన భారత కుర్రాడు.. 21-16, 21-12తో గెలుపొందాడు. క్వార్టర్స్‌లో అతడికి మూడో సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా) ఎదురుపడనున్నాడు. ఆయుష్ సెమీస్ చేరాలంటే జోనాథన్ వ్యూహాలను చిత్తు చేయాల్సిందే.




# రూ.900 కోట్ల భారీ బడ్జెట్‌తో 'రాకా'...

## అల్లు అర్జున్‌తో పాటు మిగతా వారికి రెమ్యునరేషన్ ఎంతంటే..!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ -- స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రాకా' సినిమా ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఈ చిత్రానికి సంబంధించిన భారీ పారితోషికాలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి.ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ.800 నుంచి 900 కోట్ల వరకు ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రానికి సంబంధించిన పారితోషికాలు కూడా ఇప్పుడు పెద్ద చర్చగా మారాయి. హీరో అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్ కోసం రూ.175 కోట్ల రెమ్యునరేషన్‌తో పాటు లాభాల్లో 15 శాతం వాటాను తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా విజయవంతమైతే ఆయన మొత్తం సంపాదన రూ.300 కోట్లకు పైగా వెళ్లే అవకాశముందని విశ్లేషణలు చెబుతున్నాయి.ఇక దర్శకుడు అట్లీ కూడా తన స్థాయికి తగ్గట్టుగా భారీ పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయానంతరం ఆయన ఈ సినిమాకు దాదాపు రూ.100 కోట్ల వరకు డిమాండ్ చేసినట్లు టాక్. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. ఆమెకు రూ.20 నుంచి 25 కోట్ల వరకు పారితోషికం అందుతున్నట్లు తెలుస్తోంది. అలాగే నేషనల్ క్రష్‌గా గుర్తింపు పొందిన రష్మిక మందన్న ఈ సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుండటం విశేషం. ఈ పాత్ర కోసం ఆమెకు రూ.5 నుంచి 7 కోట్ల వరకు పారితోషికం అందుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.భారీ తారాగణం, హై టెక్నికల్ వాల్యూస్, అట్లీ స్టైల్ మాస్ ఎలిమెంట్స్ అన్నీ కలిపి 'రాకా'ను ఒక విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఫస్ట్ లుక్‌తోనే భారీ అంచనాలు పెంచుకున్న ఈ చిత్రం విడుదలకు ముందే ఇండస్ట్రీలో రికార్డుల చర్చ మొదలైంది. విడుదలైన తర్వాత బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే, అల్లు అర్జున్ -- అట్లీ కాంబోలో రాబోతున్న 'రాకా' సినిమా భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలవబోతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య రూపొందుతున్న తాజా చిత్రం రాకా అల్లు అర్జున్ హీరోగా, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది.

# పెద్దితో ఆటపాట?



ఇటీవల వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది హైదరాబాదీ సొగసరి మానస వారణాసి. ప్రస్తుతం ఈ భామకు టాలీవుడ్‌లో మంచి ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రంలో ఈ అమ్మడు ఓ ఐటెంసాంగ్‌లో నర్తించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ ప్రత్యేకగీతం కోసం మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించారని, డేట్స్‌లేని కారణంగా ఆమె తిరస్కరించిందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ స్పెషల్‌సాంగ్ కోసం చిత్రబృందం యంగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే ప్రయత్నాల్లో ఉందట. ఇప్పటికే మానస వారణాసితో సంప్రదింపులు పూర్తయ్యాయని అంటున్నారు. అయితే ఈ వార్తలో నిజానిజాలెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రం ఒక్కపాట మినహా షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# గత్తర లేపిన ప్రియా ప్రకాష్..

## అందాలతో కవ్విస్తున్న కుర్ర భామ

ఒక చిన్న కన్నుగీటే సన్నివేశంతో యావత్ భారతదేశాన్ని తనవైపు తిప్పుకుంది కేరళ కుట్టి ప్రియా ప్రకాశ్ వారియర్. ఇంకా చెప్పాలంటే కేవలం ఒక్క రాత్రిలోనే సెలబ్రిటీ హోదాను సొంతం చేసుకుందీ బ్యూటీ. 'ఒరు అదర్ లవ్' సినిమాలోని సెకన్ల వ్యవధిలో ఉన్న ఆ వీడియో అప్పట్లో నెట్టింట్లో సంచలనంగా మారింది.ఇక ఈ వీడియో వైరల్ అయిన తర్వాత ప్రియాకు సినిమా అవకాశాలు వరుసపెట్టి క్యూ కట్టాయి. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ప్రియాకు ఆఫర్లు వెల్లువెత్తాయి. అయితే ప్రియా మాత్రం ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోంది. నితిన్ హీరోగా తెరకెక్కిన 'చెక్' సినిమా చేసింది.చెక్ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. చెక్ సినిమా తర్వాత తిరిగి మలయాళంలో బిజీగా మారింది. తెలుగులో చాలా కాలం తర్వాత మెగా మల్టీస్టారర్ మూవీ బ్రో సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా డిజాస్టర్ అయ్యింది. దాంతో తెలుగులో ఈ అమ్మడు పెద్దగా కనిపించడం లేదు.ఇటీవల, ఆమె "గుడ్ బ్యాడ్ అగ్లీ" చిత్రంలో అజిత్ కుమార్‌తో కలిసి నటించింది. ఈ సినిమాలో కీలక పాత్రలో నటించింది. అలాగే బాలీవుడ్‌లో "త్రీ మంకీస్", "లవ్ హ్యాకర్స్", కన్నడ చిత్రం "విష్ణు ప్రియ" వంటి ప్రాజెక్టుల్లో నటించింది. ఇక ఈ బ్యూటీ సినిమాలతో కంటే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది.సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, తన క్రేజీ ఫోటోషూట్‌లు, డ్యాన్స్ వీడియోలతో అభిమానులను అలరిస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు వైరల్ గా మారాయి. ఈ పిక్స్ కు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

## సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్



కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

# హన్సిక కుటుంబ వివాదం కోర్టుకు..

## వదినపై రూ.2 కోట్ల పరువు నష్టం దావా



సినీ నటి హన్సిక కుటుంబంలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగంగా కోర్టు మెట్లెక్కాయి. తనపైనా, తన కుటుంబంపైనా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ హన్సిక తన వదిన నాన్సీ జేమ్స్‌పై రూ.2 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ భార్య నాన్సీ జేమ్స్ గతంలో సోషల్ మీడియా వేదికగా తన అత్తగారి కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేశారు. గృహహింస, మానసిక వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె పలుమార్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలు ఒక్కసారిగా సంచలనం సృష్టించాయి.అయితే ఈ ఆరోపణలను హన్సిక తీవ్రంగా ఖండించారు. కేవలం డబ్బు వసూలు చేయాలనే ఉద్దేశంతోనే నాన్సీ ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కోర్టులో తెలిపారు. తమ స్టార్ ఇమేజ్‌ను ఉపయోగించుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్నాళ్లు ఈ వివాదంపై మౌనంగా ఉన్నానని, కానీ పరిస్థితులు హద్దులు దాటడంతో న్యాయపోరాటానికి దిగాల్సి వచ్చిందని హన్సిక పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నాన్సీ చేసిన వీడియోలు, కామెంట్లు తన తల్లి గౌరవాన్ని దెబ్బతీశాయని, కుటుంబం మానసికంగా ఇబ్బందులు పడుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు నాన్సీ జేమ్స్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. హన్సిక కుటుంబంపై అవమానకర వ్యాఖ్యలు చేయవద్దని, ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వివాదాస్పద వీడియోలను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కేసు ప్రాధాన్యతను మరింత పెంచాయి. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వాని కూడా ఈ వివాదంలో తన సోదరికి అండగా నిలిచారు. తన భార్య చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఆయన పేర్కొన్నారు. వివాహం తర్వాత కొద్దికాలానికే తమ మధ్య విభేదాలు మొదలయ్యాయని, ఇప్పుడు అవి కుటుంబ స్థాయికి చేరుకున్నాయని తెలుస్తోంది. హన్సిక తరపు న్యాయవాదులు ఈ వ్యవహారాన్ని వ్యాపార ప్రయోజనాలు లేదా వ్యక్తిగత కక్షల కోణంలో చూస్తున్నారు. నాన్సీ కావాలనే వివాదాన్ని పెద్దదిగా చేస్తున్నారని వాదిస్తున్నారు. ఇక కోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఈ వ్యవహారం మరింత మలుపులు తిరిగే అవకాశముంది. హన్సిక కోరిన రూ.2 కోట్ల పరిహారం, అలాగే భవిష్యత్తులో నాన్సీ చేసే వ్యాఖ్యలపై కోర్టు నిర్ణయం కీలకంగా మారనుంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465